క్లుప్తంగా

భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న సర్వేయర్ జయరాముడు

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. గురువారం నన్నూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పొలం విస్తీర్ణం విషయంలో చాలా వరకు తప్పులు గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం మీ భూమి-మా హామీ కార్యక్రమం ద్వారా తప్పులను సరిచేస్తామన్నారు. గ్రామసభలో ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, మండల సర్వేయర్ జయరాముడు, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



కూలీలతో మాట్లాడుతున్న నాగన్న

ఓర్వకల్లు: ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 22న చేపట్టబోయే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న కోరారు. గురువారం కేతవరం, లొద్దిపల్లె గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలలయం వద్ద చేపట్టనున్న ధర్నాకు కూలీలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

సెలవులో కర్నూలు ఎంపీడీఓ

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు ఎంపీడీఓ ఎన్ భాస్కర్ నాయుడు ఈ నెల 17, 18, 19వ తేదీల్లో వ్యక్తిగత సెలవులపై వెళ్లారు. దీంతో ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డిని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అధికారులు నియమించారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి



మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ప్రభుత్వ భవన నిర్మాణాను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాలలో నాబార్డ్ నిధులతో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టేలా పర్యవేక్షించాలని, పూర్తయిన పనుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని హెచ్‌ఎం సత్యనారాయణకు సూచించారు. కాగా పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని తనిఖీ చేశారు.

సబ్సిడీ వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలి



వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. గురువారం మండలంలోని ఎర్రదొడ్డి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎర్రదొడ్డి, చిల్లబండ గ్రామాలకు మంజూరైన వేరుశనగ విత్తనాలను పరిశీలించారు. వేరుశనగ క్వింటాల్ రూ.9,300 కాగా 40 శాతం సబ్సిడీ పోనూ రైతు రూ.5,580 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు ఆయా ఆర్బీకేల్లో సంప్రదించి విత్తనాలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

'వేలం సమాచారం ఇవ్వలేదు'

కర్నూలు (న్యూటౌన్): గ్రామ ప్రథమ పౌరుడినైన తనకే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు అమృతేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించారని ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గుట్టుచప్పుడు కాకుండా వేలం పాట నిర్వహించడంలో ఏదో మతలబు ఉందని గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారని, మరోసారి వేలంపాట నిర్వహించాలని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

సేవలకు సెల్యూట్

- నియోజకవర్గంలో ఐదుగురికి సేవావజ్ర, 20 మందికి సేవారత్న, 992 మందికి సేవా పురస్కారాలు
- పారదర్శకంగా అవార్డుల ఎంపిక
- నేటి నుంచి పురస్కార వారోత్సవాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పెన్షన్ సొమ్మును అందిస్తున్న బూజునూరు వలంటీరు

గడివేముల: సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు చేరవేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం అవార్డులు ఇచ్చి మరింత ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే రెండేళ్లపాటు సాగిన ఈ ప్రక్రియ మూడో ఏడాది కూడా కొనసాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికచేసి రివార్డులను ప్రకటించారు. శుక్రవారం నుంచి పురష్కార వారోత్సవాలు నిర్వహిస్తూ ఎంపికైన వలంటీర్లకు అవార్డులు అందజేయనున్నారు.

పారదర్శకంగా ఎంపిక

వలంటీర్లకు ఇచ్చే పురస్కారాల ఎంపిక పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా సాంకేతికంగానే రాష్ట్రస్థాయిలో టెక్నికల్ పద్ధతిలో ఎంపిక చేశారు. వలంటీర్ల పని తీరు ఆధారంగా నిర్దిష్ట సమయంలో ప్రజలకు చేసే సేవలను గుర్తించి పురస్కారాలకు అర్హులుగా నిర్ణయించారు.

మూడు రకాల అవార్డులు

వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం మూడు రకాల అవార్డులను అందిస్తుంది. 95–100 శాతం మధ్యలో మార్కులు సాధించిన వారికి సేవావజ్ర, 80–95 శాతం సాధించిన వారికి సేవారత్న, 60 శాతం పైగా సాధించిన వారికి సేవా మిత్ర అవార్డులను అందజేయనున్నారు. నియోజకవర్గంలో ఐదుగురు సేవా వజ్ర, 20 మంది సేవారత్న, 992 మంది సేవామిత్ర అవార్డులకు ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నేటినుంచి పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా వలంటీర్లకు అవార్డులు అందించనున్నారు.

కష్టపడే వారికి గుర్తింపు



కష్టపడేవారికి ఈ ప్రభుత్వం గుర్తింపు ఇస్తోంది. పథకాలకు లబ్ధిదారుల ఎంపికలోనూ, సంక్షేమ ఫలాలు పేదలకు చేర్చడంలోనూ బాగా పనిచేసిన వలంటీర్లను ప్రభుత్వం అవార్డులకు ఎంపిక చేసింది. వీరిని మిగతా వలంటీర్లు ఆదర్శంగా తీసుకుని మరింత బాగా పని చేయాలి.

– శివమల్లేశ్వరప్ప, ఎంపీడీఓ, గడివేముల

సంతోషంగా ఉంది



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు సేవలందించడం సంతోషంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున పింఛను ఇచ్చేందుకు వెళ్లినప్పుడు లబ్ధిదారుల సంతోషం చూసి చెప్పలేని సంతృప్తి కలిగేది. మా కష్టాన్ని గుర్తించి అవార్డుతో ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు.

– గువ్వల నరేష్, సేవావజ్ర, బూజునూరు

ప్రజాసేవా ఎంతో బాగుంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు సకాలంలో చేరవేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నాను. వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక వంటి పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేస్తున్నాను.

– మూల వెంకటయ్య, పెసరవాయి

నేడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కల్లూరు: స్థానిక 19వ వార్డులోని మదర్‌ల్యాండ్ ప్రధాన రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన ఉంటుందని మేయర్ క్యాంపు కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయి వైభవ్‌నగర్ నుంచి చెక్‌పోస్టు వైపు వెళ్లే రహదారికి, చెక్‌పోస్టు నుంచి జొహరాపురం వెళ్లే రహదారికి అనుసంధానంగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.50 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శంకుస్థాపనకు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు కానున్నారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన మినీ గురుకుల పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాధవి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ 1 నుంచి 6వ తరగతి వరకు చెంచు బాలికలకు 54 సీట్లు, జనరల్ ఎస్టీ 44 సీట్ల చొప్పున మొత్తం 98 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ సాయంత్రం 5.30గంటల్లోపు దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 9491398955కు సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

- డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి



గుడిపాడు పెద్ద కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

గూడూరు రూరల్: కూలీలు ఉపాధి పనులను వినియోగించుకోవాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గుడిపాడు, పెంచికలపాడు పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. రోజు వారీ వేతనం ఎంత పడుతుంది, కొలతల ప్రకారం చేస్తున్నారా, పనులను ఎన్ని గంటలు చేస్తున్నారనే విషయాలను కూలీలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గుముఖం పట్టాయన్నారు. కూలీలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రతి గ్రామంలో వీలైనన్ని ఎక్కువ పనులను పెడుతున్నామన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరుకుని నిర్ణీత సమయంలోగా కొలతల ప్రకారం పనులు చేసి రోజుకు రూ.272 వేతనం వచ్చేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఓ హసీనా ఉన్నారు.

ప్రతి రోజు స్పందన నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని వర్కూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి రోజు నిర్ణీత సమయంలోగా సచివాలయానికి హాజరు కావాలని, మధ్యాహ్నం స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వేను త్వరగా పూర్తి చేయాలని, హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామంలో పండ్ల తోటలు సాగు చేసే రైతులను గుర్తించి వారిని ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు.

సంక్షేమ పథకాలతోనే పేదల ఆర్థికాభివృద్ధి

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



జూలకల్‌లో ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న వృద్ధుడు

గూడూరు రూరల్: సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికాభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని జూలకల్‌లో రెండవ రోజు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించారు. ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉందని, తాగేందుకు నీరు లేక గూడూరు నుంచి వచ్చే మినరల్ వాటర్‌ను బిందెకు రూ.10 చొప్పున చెల్లించి దాహం తీర్చుకుంటున్నామని, గతంలో నంద్యాల వాటర్ స్కీం ద్వారా తాగునీరు వచ్చేదని, దశాబ్ద కాలంగా నీటి సరఫరాను నిలిపేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కొందరు, కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని మరికొందరు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన త్వరలోనే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీటిని అందిస్తామని, డ్రైనేజీ సమస్య ఉన్న కాలనీల్లో సచివాలయ నిధులతో నూతన డ్రైనేజీలు ఏర్పాటు చేస్తానమి హామీ ఇచ్చారు. ప్రజలకు నిరంతరం సేవ చేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దామోదర్‌రెడ్డి, దేవారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు మౌలాలి, నరసింహారెడ్డి, ఎంపీడీఓ మాధవీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన, ఎంఈఓ సునీలమ్మ పాల్గొన్నారు.

నేడు పొన్నకల్‌లో..

మండల పరిధిలోని పొన్నకల్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మాధవీలత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె తెలిపారు.

రివార్డులకు వలంటీర్ల ఎంపిక

ఓర్వకల్లు: గ్రామస్థాయిలో వలంటీర్లు అందజేస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం రివార్డులను అందజేస్తోంది. ఈ రివార్డులకు మండలంలో 260 మంది ఎంపికైనట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. సేవా మిత్రకు 256 మంది, సేవా రత్నకు 4 ఎంపికైనట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని



తడకనపల్లె సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలోని శ్రీనగర్ కాలనీ, మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలు/వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనకు సీఎంగా పట్టం కట్టాలని కోరారు. కాగా గ్రామంలో తాగునీటి, డ్రైనేజీ కాలువల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, తడకనపల్లె గ్రామ నాయకులు సోమన్న యాదవ్, కృష్ణారెడ్డి, నరసింహులు, లక్ష్మన్న, చిన్నస్వాములు, రామిరెడ్డి, దమోధర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముందుగానే సమాచారం అందించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య



ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల్లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ఒక రోజు ముందుగానే గ్రామాల్లో సమాచారం ఇచ్చి ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపుల్లో పాల్గొనేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్ల గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఓపీకి వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేయాలన్నారు. మధ్యాహ్నం ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులను కలుసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈడీడీ క్యాలెండర్‌లో ఉన్న ప్రమాదకర గర్భిణీలను ప్రసవానికి వారం ముందుగా ప్రభుత్వ ఆస్పతిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. గర్భిణులకు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. రక్త హీనత కల్గిన వారిని గుర్తించి తగు చర్యలు మందులు ఇవ్వాలన్నారు. గర్భిణులకు, పిల్లలకు అందించిన ఆరోగ్య సేవల వివరాలను హెల్త్ యాప్, ఎంఎల్‌హెచ్‌పీ యాప్, ఏఎన్‌ఎం హెల్త్ యాప్‌లలో ఎప్పటికప్పు అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2ను తనిఖీ చేశారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను, పోషకాహార లోపం ఉన్న పిల్లలను ప్రభుత్వ ఆస్పత్రిలోని పోషకాహార పునరావాస కేంద్రానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం సర్వేనెం 789లోని భూమిపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి, వారి బంధువులకు ఎలాంటి సంబంధం లేదని భూ యజమాని బి.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కర్నూలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నంబర్‌లో మొత్తం 11.54 ఎకరాల భూమి ఉందన్నారు. అందులోని మాజీ సైనికునికి సంబంధించి 5 ఎకరాల భూమిని తనతో పాటు భాస్కర్‌రెడ్డి, హిన్నా, చంద్రకళ, ధరణిరెడ్డి కలసి కొనుగోలు చేశామన్నారు. అందులో 3.75 ఎకరాలకు ఎంజాయిమెంట్ ఉందన్నారు. అందుకు సంబంధించి డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయన్నారు. టీడీపీ నాయకులు 789 సర్వే నంబర్ భూమిపై చేస్తున్న అసత్యా ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. సమావేశంలో బలరామ్‌రెడ్డి, కె.శివారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

20 నుంచి 'వలంటీర్లకు వందనం'

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లను సన్మానించేందుకు ఈ నెల 20 నుంచి వలంటీర్లకు వందనం కార్యక్రమం చేపట్టనున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ చెప్పారు. గురువారం ఆయన తన నివాసంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, మరుసటి రోజు నుంచి నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. రోజుకు రెండు గ్రామ, రెండు వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లను సన్మానించేందుకు షెడ్యూల్‌ను రూపొందించాలన్నారు. సమావేశంలో కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, కర్నూలు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, గూడూరు ఎంపీడీఓ మాధవీలత, సి బెళగల్ ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ షాకీర్, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మౌలాలి, సచివాలయ కన్వీనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత

ఓర్వకల్లు: అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని నన్నూరు వద్ద గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు. బియ్యం తరలిపోతోందని వచ్చిన సమాచారంతో విజిలెన్స్ ఎస్ఐ హనుమంతయ్య, అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. మినీ లారీని ఆపి సోదాలు చేయగా గడివేముల నుంచి 62 బస్తాల బియ్యం తడకనపల్లెకు తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యం బస్తాలకు సంబంధించిన ఏ విధమైన బిల్లులు లేకపోవడంతో అక్రమ బియ్యమని నిర్ధారించారు. తడకనపల్లెకు చెందిన ఈశ్వరయ్య, షేక్ అలీబాషాను అదుపులోకి తీసుకుని విచారించగా.. సదరు బియ్యం మినీ లారీ ఓనర్ బెస్త గంగాధర్ అని తేలింది. గడివేములకు చెందిన వెంకటరెడ్డి అనే వ్యక్తి తెల్ల కార్డుదారుల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి లారీలో లోడ్ చేసినట్లు విచారణలో అంగీకరించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వేటగాళ్ల చర్యలతో విద్యుత్ సమస్యలు

పాణ్యం: అడవిపందుల వేటగాళ్ల చర్యల విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అటవీ ప్రదేశంలో విద్యుత్ మెయిన్ వైర్లు వెళ్లాయి. రాత్రి సమయాల్లో వేటగాళ్లు అడవిపందుల కోసం లైన్లపై ఇనుప వస్తువులు వేయడంతో వైర్లు జాయింట్ అయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. వేటగాళ్ల ఆగడాలు ఇటీవల మరీ ఎక్కువైనా అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

'నటరాణి' పురస్కార గ్రహీత అరుణకుమారి



కేక్ కట్ చేస్తున్న అరుణకుమారి, సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: రంగస్థల కళాకారిణి అరుణకుమారికి 'నటరాణి' పురస్కారాన్ని తిరుపతి శ్రీ వంశీ కళా పరిషత్ వారు ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు గురువారం మద్దూరు నగర్ పింగళి సూరన తెలుగు తోటలో ఆమెను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య మాట్లాడుతూ అరుణకుమారి రాయలసీమ జిల్లాల్లో ప్రఖ్యాత రంగస్థల కళాకారిణిగా గుర్తింపు పొందారన్నారు. కళాసేవకు గుర్తింపుగా నటరాణి పురస్కారం అందుకోవడం హర్షనీయమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫివుల్లా, సభ్యులు ఎం.రాజారత్నం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్య పరిచేవి సాంఘిక నాటికలు



కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: సామాజాన్ని చైతన్య పరిచేవి సాంఘిక నాటికలని పీఎంకేఎం వ్యవస్థాపకులు వెంకటరమణ అన్నారు. పీఎంకేఎం, వైఎస్సార్ కళాపరిషత్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 42వ జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం 82 సమాజాలు దరఖాస్తు చేసుకోగా 40 సమాజాలకు అవకాశం కల్పించామన్నారు. ఎనిమిది ప్రాంతాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో ఎంపికైన వాటికి చివరిగా జనవరిలో ఒంగోలులో పోటీలు నిర్వహిస్తామన్నారు. టీజీవీ కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మూడురోజుల పాటు కనువిందు చేసే నాటకాలు కర్నూలుకు రావటం సంతోషదాయకమన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు విశాఖ పట్నం కళాభినయ వారి 'ఓ కాశీ వాసీ రావయ్య', రాత్రి 7.30 గంటలకు వీరన్న పాలెం కళానికేతన్ వారి 'స్థిరాస్తి', రాత్రి 8.30 గంటలకు ఒంగోలు గొల్లపల్లి ఆర్ట్స్ వారి 'కనిపించే దైవం' నాటికలు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు యాగంటీశ్వరప్ప, పాండురంగయ్య, ఇనాయతుల్లా, పీఎంకేఎం పీఆర్వో బొ్రా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

కళా శోభా క్రియేషన్స్ వారి 'ఒక్క క్షణం', గుంటూరు శ్రీ అమృతలహరి థియేటర్స్ వారి 'నాన్నా... నేనొచ్చేస్తా', విజయవాడ హర్ష క్రియేషన్స్ 'వారి స్వర్ణ కమలాలు' నాటికాలు ప్రదర్శనలు చూపరులను అలరించాయి.